నత్తనడకన..

- పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులు
- ఆరు నెలల క్రితం ప్రారంభం
- పిల్లర్ల దశలో నిలిచిన పనులు
- ఇప్పటికీ పూర్తికాని వైనం
- ఇబ్బందుల్లో ప్రజలు, కార్మికులు


పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి (ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరునెలల క్రితం ప్రారంభించిన పనులు ఇప్పటికి పిల్లర్ల దశలో నిలిచిపోయింది. టాయిలెట్లు లేక పట్టణ ప్రజలు, వ్యాపారులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. రూ. 18 లక్షల నిధులతో జనవరి 21న పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, ఇంజినీర్‌ను ఆదేశించారు. ఆరు నెలలు గడుస్తున్నా పనులు ఇప్పటికి పూర్తికాలేదు. ఎమ్మెల్యే వద్దకు వెళ్దామంటే ఆయనకు స్థానికంగా ఆఫీసు లేదనిపేర్కొంటున్నారు. పనుల విషయమై అధికారులు పట్టించుకోవడం లేదని, కాంట్రాక్ట్ పనులు నిర్వహించేవారు నాయకులేనని పలువురు మండిపడుతున్నారు.

పబ్లిక్ టాయిలెట్ లేక ఇబ్బంది

మందమర్రి మార్కెట్ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్ లేక ప్రజలు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్ ఏరియాలో వందలాది షాపులు ఉన్నాయి. షాపింగ్‌కు వచ్చే ప్రజలకు పబ్లిక్ టాయిలెట్ లేకపోవడం ఇబ్బందిగా ఉంది. వారి అవసరానికి రైల్వేస్టేషన్ రోడ్డులోని సింగరేణి నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగించుకుంటున్నారు. ఈ కాంప్లెక్స్‌కి వెళ్లడానికి గతంలో మార్కెట్‌లో గల బాలాజీ గిఫ్ట్ సెంటర్ పక్కన దారి ఉండేది. రెండు, మూడేళ్ల క్రితం ఆ దారి మూసేయడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. ఏది ఏమైనా సంబంధిత అధికారులు, నాయకులు పబ్లిక్ టాయిలెట్ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలనికోరుతున్నారు.


నిర్మాణ దశలో పబ్లిక్ టాయిలెట్

పనులు వేగవంతం చేస్తాం


రూ. 18 లక్షలతో చేపట్టిన పబ్లిక్ టాయిలెట్ పనులు వేగవంతం అయ్యేలా చూస్తాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరగా పూర్తిచేయిస్తాం. టాయిలెట్లు అందుబాటులోకి తీసుకువస్తాం.

– వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్

జూదం.. రోడ్డున పడ్డ కుటుంబం

- అప్పులపాలై ప్రాణం తీసుకున్న వ్యాపారి
- ఈనెల 17న ఆత్మహత్య
- బలవన్మరణానికి ముందు సూసైడ్ నోట్
- అందులోని పలువురి పేర్లు ప్రస్తావన..

లక్సెట్టిపేట: జూదం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. బాధిత కుటుంబం రోడ్డున పడింది. పట్టణానికి చెందిన బోర్ల దుకాణం వ్యాపారి ప్రతాప్ పేకాట మోసంలో అప్పులపాలై ఈనెల 17న ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బలవన్మరణానికి ముందు సూసైడ్ నోట్ రాశారు. అందులో పలువురి పేర్లు ప్రస్తావించడం చర్చనీయాంశంగా మారింది. పేకాట మోసంలో రూ.30 లక్షల అప్పు ముగ్గురి పేర్లు, ఇతర విషయాల్లో కొందరు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యక్తులు, బడా నాయకులు, జరిగిన వ్యవహారంలో సాక్షుల పేర్లు మృతుడు రాసినట్లు తెలుస్తోంది. సుమారు 10 పేజీల సూసైడ్ నోట్ రాసినట్లు కుటుంబీకులు మీడియాకు వెల్లడించారు. పలువురి పెద్ద మనుషులకు చెప్పినా న్యాయం జరుగకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పలువురు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే పట్టించుకుని తమకు న్యాయం చేయాలని కుటుంబీకులు కోరుతున్నారు.

పట్టింపులేని అధికారులు

గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో జూదం క్రీడ జోరుగా సాగుతుందని సమాచారం. అయినా అధికారులు పట్టింపులేనట్టుగా వ్యవహరిస్తున్నారు. రహస్య ప్రదేశాల్లో జూదం క్రీడల్లో పలువురు లక్షల రూపాయల్లో పోగొట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెన్నెల: గడ్డిమందు తాగిన యవకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలోని ఘన్‌పూర్‌కు చెందిన పోలంపల్లి మల్లేశ్ (28) మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. ఈనెల 17న గొల్లపల్లి శివారులో మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. తనను బతికించాలని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. అతన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. భార్య సంధ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: సీజనల్‌వ్యాధుల వ్యాప్తి నివారణకు ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇండోర్ రెసిడ్యుల్ స్ప్రే (ఐఆర్ఎస్) చేయడానికి కొటేషన్లతో కూడిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో అనిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 21లోగా దరఖాస్తును జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందించాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రాజెక్టు కాలువలకు మరమ్మతు


మరమ్మతు చేయిస్తున్న నాయకులు

నెన్నెల: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి కుమ్మరివాగు ప్రాజెక్టు కొత్తగూడంలోని ఎడమ కాలువకు గండిపడి నీరంతా పొలాల్లోకి చేరింది. ప్రజలు ఈ విషయాన్ని గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన జేసీబీతో ప్రాజెక్టు కాలువకు మరమ్మతు చేయించారు. కాలువలో పిచ్చిమొక్కలను తొలగించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, సంతోష్, అంజి పాల్గొన్నారు.

అధికారుల బదిలీ

భీమారం: మండలంలోని పలువురి అధికారులు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో రాధా రాథోడ్‌ని నిర్మల్‌కు, ఎంపీవో శ్రీపతిబాపురావు జైపూర్‌కు, కన్నెపల్లి ఎంపీవో సతీశ్‌రెడ్డి భీమారానికి బదిలీయ్యారు. మండలంలోని దాంపూర్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి రామకృష్ణ సర్కార్‌కి జైపూర్‌కు, కాగజ్‌నగర్ డివిజన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్‌ను భీమారానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మీ సేవ కేంద్రాలు కేటాయించాలి


బీసీ సంక్షేమాధికారికి వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ

పాతమంచిర్యాల: దివ్యాంగులకు మీ సేవ కేంద్రాలు మంజూరు చేసి ఉపాధి కల్పించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు సత్యనారాయణ కోరారు. జిల్లాకేంద్రంలో బీసీ సంక్షేమ అధికారి చిన్నయ్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఆయన వెంట జిల్లా నాయకుడు అప్పారావు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పట్టణంలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో ఖాతాదారు అయిన అరికొల సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పొందిన ఆయనకు రూ.2 లక్షల చెక్కు మంజూరైంది. బ్యాంకు చైర్మన్ వి.వినయ్ కుమార్, సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి శుక్రవారం మృతుడి భార్య భాగ్యలక్ష్మికి రూ.2 లక్షల బీమా చెక్కు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

'టీచర్ల ఏకీకృత సర్వీసు రూల్స్ సాధిస్తాం'

చెన్నూర్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు సాధించిన ఘనత పీఆర్టీయూ టీఎస్‌కే దక్కుతుందని జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధిస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తిరుపతయ్య పాల్గొన్నారు.

కాసిపేట: కాసిపేట, ముత్యంపల్లి, దేవాపూర్, లంబాడితండా, పెద్దనపల్లి గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, టీఎస్ఎంఎస్, ఉన్నత పాఠశాల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షురాలు శాంకరి, మండల అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడారు. బదిలీ అయిన తర్వాత వెంటనే టీచర్లను రిలీవ్ చేయాలన్నారు. రాష్ట్ర బాధ్యులు సాంబమూర్తి, జ్యోతి, శ్రీనివాస్, మండల కార్యదర్శి కృష్ణ గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులు రోడ్డెక్కితే జరిమానా

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో పశువులు రోడ్లపైకి వస్తే యజమానులకు రూ.5 వేల జరిమానా విధిస్తామని కమిషనర్ గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రధాన రోడ్లలో పశువుల సంచారంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. యజమానులు తమ పశువులను మేత కోసం అడవులకు పంపిస్తూ పాకలల్లో ఉంచుకోవాలని తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి

- జిల్లా అధ్యక్షుడు కొమురయ్య

దండేపల్లి/జన్నారం/చెన్నూర్: ముదిరాజ్‌లను బీసీ 'డీ'నుంచి బీసీ 'ఏ'లో చేర్చాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కొమురయ్య డిమాండ్ చేశారు. దండేపల్లిలో శుక్రవారం సంఘ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల వృతిచేస్తున్న ముదిరాజ్‌లకు 50 ఏళ్లకే ఆసరా పింఛన్లు అందించడంతోపాటు వారి పిల్లల చదువుల కోసం ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీటీ విజయకు వినతిపత్రం అందించారు. జీవో నంబర్ 15 ప్రకారం ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ'ఏ'లోకి చేర్చాలని కొమురయ్య నాయకులతో కలిసి జన్నారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో చెన్నూర్ తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. కుటుంబ సర్వే ప్రకారం బీసీ కులాల్లో 14 శాతం ఉన్న ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడ్డారని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, మహాసభల జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, మండల నాయకులు గంగమల్లు, రమేశ్, శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనబోయిన కృష్ణ, తదితరులు ఉన్నారు.


జన్నారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

రాంపూర్‌లో 'పోలీసుల పల్లెనిద్ర'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని రాంపూర్‌లో శుక్రవారం పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. రామగుండం సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు ఏసీపీ ప్రకాశ్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పల్లెనిద్రలో ఎస్సై గోపతి సురేశ్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రజల రక్షణ, భద్రతకు కృషి చేస్తామన్నారు. అట్రాసిటీ కేసుల విషయంలో బాధితులకు భరోసా కల్పించారు. గ్రామస్తులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో 100 డయల్ చేయాలన్నారు. యువతులకు, మహిళలు, బాలికలకు ఆపద తలెత్తితే షీటీంను సంప్రదించాలన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సురేశ్

రుణమాఫీతో బ్యాంకుల కిటకిట

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేసింది. రైతులు రుణం మాఫీ కోసం శుక్రవారం బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. మాఫీ అయిన వారు సంతోషం వ్యక్తం చేశారు. దండేపల్లి టీజీబీ రైతులతో కిటకిటాలాడింది.



షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

మంచిర్యాలక్రైం: మున్సిపల్ కార్యాలయ సమీపంలో జంగం తిరుపతికి చెందిన ఎలక్ట్రికల్, శానిటేషన్ షాపులో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఫైర్ అధికారి దేవేందర్ కథనం ప్రకారం.. రోజు మాదిరిగా తిరుపతి పని ముగించుకొని షెటర్ బంద్ చేసి వెళ్లిపోయాడు. రాత్రి సమయంలో షాపులో నుంచి పొగలు రావడంతో స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.30 లక్షల విలువ గల వస్తువులు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు.


మంటలార్పుతున్న ఫైర్ అధికారులు

సంక్షిప్తంగా

స్తంభాల మరమ్మతు పరిశీలన

వేమనపల్లి: భారీ వర్షానికి మల్లంపేట అటవీ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలపై చెట్లు పడిపోవడంతో వేర్వేరు చోట్ల మూడు స్తంభాలు నేలకూలాయి. కిష్టంపేట 133 కేవీ విద్యుత్ లైన్ నుంచి కోటపల్లి మీదుగా నీల్వాయి సబ్‌స్టేషన్‌కు వచ్చే మెయిన్ లైన్‌పై చెట్లు పడిపోయాయి. గురువారం రాత్రి నుంచి మండల కేంద్రానికి సరఫరా నిలిచిపోయింది. ఏఈ దీక్షిత్ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది మరమ్మతు చేపట్టారు. ఎస్ఈ శ్రావణ్‌కుమార్, డీఈ రాజన్నలు పరిశీలించారు. సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ బాట

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం కొనసాగుతోంది. అశోక్‌రోడ్డు 2 అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గోపాల్‌వాడ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసంతోపాటు, గోరింటాకు పెట్టారు. మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక హాజరై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి అధ్యయన యాత్రలు ప్రారంభం

చెన్నూర్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శనివారం నుంచి వసతి గృహాల అధ్యయన యాత్రలు నిర్వహిస్తున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వసతి గృహాలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా విద్యార్థులకు దుప్పట్లు, పెట్టెలు, ప్లేట్లు అందించలేదన్నారు. ఒక్కో వార్డెన్‌కు రెండు నుంచి మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జీలుగా నియమించడంతో పర్యవేక్షణ కరువైందన్నారు. కుమార్, మధుకర్ పాల్గొన్నారు.

ఓసీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

మందమర్రిరూరల్: రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఏరియాలోని కేకే-ఓసీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. శుక్రవారం 6 వేల టన్నుల ఉత్పత్తికి ఆటంకం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.

నోటు పుస్తకాలు, బ్యాగులు అందజేత

చెన్నూర్: పట్టణంలోని నలగొండపోచమ్మ వాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆశాజ్యోతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 600 నోటు పుస్తకాలు, 100 బ్యాగులను అందజేశారు. నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెగిన రోడ్లు.. నీట మునిగిన పత్తి


కమలాపూర్ ప్రాజెక్టు కెనల్‌కు గండి పడటంతో వృథాగా పోతున్న నీరు

- వరద ధాటికి కొట్టుకుపోయిన బీటీ రోడ్లు
- స్తంభించిన రాకపోకలు


చిన్నతిమ్మాపూర్ శివారులో నీట మునిగిన పత్తి

భీమిని: ఎడతెరిపి లేకుండా భారీగా గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి భీమిని, కన్నెపల్లి మండలాల్లో పలుచోట్ల పత్తి పంట నీట మునిగింది. వరద ఉధృతికి ఖర్జీభీంపూర్ వెళ్లే బీటీ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతు చేపట్టారు. పీపీరావు ప్రాజెక్టు, ఎర్రవాగు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో చిన్నతిమ్మాపూర్ పరిధిలో సుమారు 60 ఎకరాల పత్తి నీట మునిగింది. వ్యవసాయాధికారులు పంట నష్టాన్ని అంచనా వేశారు. కమలాపూర్ ప్రాజెక్టు కెనాల్ గండిపడటంతో నీరు వృథాగా వెళ్లిపోయింది. గ్రామాల్లో చెట్లు విరిగిపడటంతో విద్యుత్ అంతరాయం చోటు చేసుకుంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న 'తుతుంగ'

కోటపల్లి: కురుస్తున్న భారీ వర్షాలకు ఎదులబంధం తుతుంగ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వరద ఉధృతికి కోతకు గురి కాగా, 12 గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి. చెన్నూర్, కోటపల్లి ప్రాంతాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొత్తపల్లి రాజారం దేవులవాడ మధ్యలో వాగుపై వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. నక్కలపల్లి వెళ్లే దారిలో లోతొర్రెవాగు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోగా సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్‌లు తాత్కాలికంగా రోడ్డు మరమ్మతు చేయించారు. గురువారం కురిసిన వర్షానికి పూర్తిగా కొట్టుకుపోయి 5 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పోటెత్తుతున్న 'ప్రాణహిత'

వేమనపల్లి: గంట గంటకు వరద తీవ్రతతో ప్రాణహిత నది పోటెత్తుతోంది. లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేళ్ల నీటమునిగాయి. మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దులో నాటుపడవల రాకపోకలు నిలిచిపోయాయి. వరద ధాటికి నీల్వాయి ప్రాజెక్టు నిండుకుండలా మారి మత్తడి దూకింది. ఇరిగేషన్ డీఈ వెంకటస్వామి, ఏఈ హరికృష్ణలు ప్రాజెక్టు వద్దకు వెళ్లి వరద ఉధృతిని పరిశీలించారు. వరదతో కొత్తపల్లి బతుకమ్మ వాగు పోటెత్తి ప్రవహించింది. నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాల్వ అసంపూర్తి నిర్మాణంతో రాజారాం వద్ద అప్పుడు ఒర్రెకు వెళ్లాల్సి వరద దారిమళ్లి కొత్తపల్లి వాగు వైపు పోటెత్తింది. కొత్తపల్లి వాగు, రాజారాం, వేమనపల్లి ఎంచపాయ ప్రమాదకరంగా ప్రవహించింది. ప్రధాన రహదారి వరకు 3 కి.మీ దూరం వరకు పొలాలు చెరువులను తలపించాయి. నారుమళ్లు, పత్తి చేళ్లు వరద పాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన దాసరి సత్తయ్య ఇంటి గోడ కూలింది.

నేలకూలిన నరేప వృక్షం

శుక్రవారం తెల్లవారుజాము కురిసిన వర్షానికి నీల్వాయి అటవీ ప్రాంతంలోని పెద్దమొరి వద్ద 40 ఏళ్ల నాటి నరేప వృక్షం నేలకూలింది. మరో మూడు వృక్షాలు పడిపోయాయి. మండల కేంద్రంతోపాటు నీల్వాయి, ముల్కలపేటలో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఎస్సై శ్యాంపటేల్ సిబ్బందితో జేసీబీతో చెట్లను తొలగింపజేశారు. అనంతరం బస్సులతోపాటు రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఉప్పొంగిన వాగులు

చెన్నూర్‌రూరల్: సుద్దాల, నారాయణపూర్, రాయిపేట, కత్తెరసాల, సంకారం, బుద్దారం వెళ్లేదారిలో వాగులు పొంగి ప్రవహించాయి. అక్కెపల్లి సమీపంలోని వాగుపై ఉన్న కాజ్‌వే పై వరదనీరు ప్రవహించడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి.


ఎదులబంధం వాగు ఉధృతికి తెగిన రోడ్డు


రోడ్డుకు ఇరువైపులా ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు


మత్తడి దుంకుతున్న నీల్వాయి ప్రాజెక్టు


ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది


జేసీబీతో చెట్లను తొలగింపజేస్తున్న ఎస్సై

బీసీల డిమాండ్లు నెరవేర్చాలి

పాతమంచిర్యాల: బీసీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. 'బీసీల పోరుబాట'నినాదంతో జిల్లాకేంద్రం నుంచి లక్సెట్టిపేట వరకు నాయకులు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా బీసీలు తమ సమస్యలు పరిష్కరించాలని ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నప్పటికి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు లచ్చన్న, శ్రీపతిరాములు, చంద్రమౌళి, సతీశ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే మట్టి రోడ్డు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాళ్లవాగుపై నిర్మించిన కాజ్‌వేపై వేసిన తాత్కాలిక మట్టి రోడ్డు వరద నీటికి కొట్టుకుపోయింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు కురిసిన భారీ వర్షానికి రాళ్లవాగు ఉప్పొంగి, కాజ్‌వే పైనుంచి వరద నీరు పారింది. గతంలో వరద నీటికి కాజ్‌వే కొట్టుకు పోగా, మట్టి వేసి తాత్కాలికంగా రోడ్డు వేశారు. ప్రస్తుతం వరద నీటికి కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



సమస్యలపై బీజేపీ పోరాటం

తాండూర్: మండల పరిధిలో నెలకొన్న సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే ఏ.శ్రీదేవి తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు భరత్ కుమార్ అధ్యక్షతన మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యవర్గ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు.అన్ని పంచాయతీల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడం, స్వచ్ఛమైన తాగునీరందించడం, మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంతోపాటు అన్ని సమస్యలు పరిష్కరించాలన్నారు. మండల కేంద్రంతోపాటు బుధ, శనివారాల్లో సంత ప్రాంగణాల్లో, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన విద్య అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు చిరంజీవి, తుకారాం, సిద్దం మల్లేశ్, కుమార్, ప్రదీప్, విగ్నేష్, చంద్రయ్య, దుర్గాచరణ్, ప్రవీణ్, నాగభూషణ్ పాల్గొన్నారు.